# నా మమకారం

• గర్నెపూడి సీతారామశర్మ •

వచ్చా అబ్బాయీ ?

కాదు. మా వాడు యిక్కడకు తెలీకుండా యెట్లా వస్తాడు ? నేనంటే చాలా భయం ! కాని నాకు మాత్రం ప్రేమ మెండు. ఇక్కడకు రేపు తిరణాల కాబట్టి వచ్చాను నేను. వాడు వంటరిగా వస్తాడా ?

ఆ మాత్రం భయంలే, వాడికి ? రాడు—

ఆ అబ్బాయి మా వాడిలాగే వున్నాడే ! ఆ ముసలమ్మతోటి, చెట్లూ చేమలు తిరుగుతున్నాడు. రేపు తిరణాలనా ?—

అయినా, వాళ్లే బొమ్మమటుకు తీసుకవస్తుండా ? వచ్చినా నన్ను కలుసుకోరూ ?—

తిరణాలరోజు !...

ఆ అబ్బాయి బండిక్రింద పడబోతున్నట్లుంది ! చూద్దాం ఎవరో అబ్బాయి. ఆ...మా వాడిలాగే వున్నాడే ! చూస్తారేం, చుట్టుపట్ల మనుషులు, గొడ్డులా, పిల్లవాణ్ణి తియ్యకుండా చూస్తారేం ? వస్తూన్నా...!

మా వాడు కాదు, నా కెందుకులే ! ఆ గోల తోటి నాకేం అవుసరముంది. నా గొడవనే చూచుకుంటాలే 'కడగా బోయ్యే ఖర్మనా నా కాలి మీదుగా పొమ్మని' నే దగ్గరకు వెళ్తే నేనే చంపేనంటారేమో ? అంతమాత్రంవాళ్ళే యీ లోకం ప్రజలు.

... ... ...

బజారునుంచి వస్తూ 'టాం' 'టాం' విన్నాను.

"షుమారు, ఎలమిదిఏండ్ల కుర్రవాడు కొంచెం పొట్టిగా, ఎర్రగా బొద్దుగా వుంటాడు. చిన్న కాఫు, ఎడమపాపట, కుడిబుగ్గమీద అరఅంగుళం పుట్టుమచ్చ. ఈ గుర్తులు గల కుర్రవాడు మారుపడి ఏడుస్తూవుంటే పెదబజారులో తీసుక వచ్చాం. పదిగంటలకు పోలీసుస్టేషనులో వున్నాడు. తలిదండ్రులు ఎవరన్నా వస్తే, ఆ అబ్బాయిని గుర్తుపడితే, నిరభ్యంతరముగా తీసుకు వెళ్లవచ్చు"

ఆ...ఎందీ ? కుర్రవాడా ?

మా వాడికి కుడిబుగ్గమీద కాదే ! ఎడమబుగ్గమీద, అయినా అరఅంగుళం కాదు, కొంచెం చిన్న పుట్టుమచ్చ! అయినా ప్రకటన పొరపాటున ప్రకటించారేమో ? వీళ్ల ప్రకటనలు ఎప్పుడూ యిలాగే ఏడుస్తుంటాయి. తొందరగా పోయి చూస్తా.

స్టేషనులో—

మా వాడు కాదు. కాని యింటిప్రక్కన వీధిలో బుగ్గారేలు అమ్ముకునే వెంకన్న కొడుకు నన్ను చూచి గుర్తుపట్టాడు. నాతో వస్తానంటున్నాడు. పోలీసువాళ్లు నాతో పంపుతామంటున్నారు. ఐనా నా కెందుకు రేషన్ షాపుకు వెళ్ళి పంచదార తెచ్చుకోవాలె, లేక నేను తీసుకవెళ్లితే యీ 'తంతు' అంతా నేనే పన్నాను అనుకుంటారు బజారువాళ్ళంతా !

ఆఫీసులో—

పని తీవ్రంగా వుంది. తప్పు మొసలకుండా చేస్తున్నా, కాని ఆఫీసరుగారు చెయ్యమన్న పని అయిందేమోనని, క్షణక్షణం బిల్లబంట్రోతు యమదూతలా ప్రత్యక్షం. నేను వాణ్ణి చివాట్లు పెడుతున్నాను. ఆఫీసరు పెట్టే చివాట్లు, వాడు తిట్టుకున్న తిట్లు, చీటిరూపకంగా ఆఫీసరుగారివద్దనుంచి వ్రాయించకవస్తూన్నాడు. వాడే మొనగాడు !

ఇంటిప్రక్కవాళ్ళ అబ్బాయి రొప్పుకుంటూ ముచ్చెమటల్తో ప్రత్యక్షం అయ్యాడు నాగదిలోకి.

"ఏంరా బాబూ...? ఇంత తొందరగా వచ్చావు అసలు సంగతి చెప్పు. ఆలస్యంచేస్తావేంరా ? నేను ద్రోహినికాదు లేరా ? అనుమానించక చెప్పు," కురిపించాను ప్రశ్నలవర్షం.

తడబడుతూ 'మీ అబ్బాయి, భావిలో పడ్డాడు. వెంబడే చూసితీశారు. కొంచెం షుమారుగానె వుంది. నీతో చెప్పి రమ్మన్నారు. ఫరవాలే ! కొంచెం షుమారుగానే యున్నది" అన్నాడు.

ఆఫీసరువంక చూడకుండానే వచ్చాను యింటికి. ఇంట్లో కుర్రవాడు కులాసాగానే యున్నాడు. భావిలోనుంచి పిల్లవాణ్ణి తీసిన కసాయివాడు డబ్బులు అమితంగా అడుగుతున్నాడు. పేచీపెట్టాను పిల్లవాడు కులాసాగానే యున్నాడు ఫర్వాలేదు గాబట్టి పెద్దమనుషులు తీర్పు చెప్పారు వాడికి అనుకూలంగా.

ఆఫీసరు గారితో చెప్పి ఆ రోజుకు యింటికి వచ్చేద్దామని ఆఫీసుకు వెళ్లాను. నా సీటులో ఎక్కౌంటుబుక్కు పోయింది. ఆఫీసరు గారు అడిగాడు. సంజాయిషి చెప్పలేక గుడ్లు తప్పచెప్పా, దయా దాక్షిణ్యం లేకుండా, సెక్యూరిటీ కట్ చేస్తూ 'ఫ్రాడు' చేశాడు నన్ను వుద్యోగంలోంచి ఆఫీసరుగారు.